సాక్షి కామారెడ్డి
మంగళవారం ၊ 3 ၊ సెప్టెంబర్ ၊ 2024



కాజ్‌వేను మూసేయండి

వరద ఉధృతి తగ్గేంతవరకు భవానీపేట్‌–పోతారం మధ్యలోని కాజ్‌వేను మూసివేయాలని కలెక్టర్ సంగ్వాన్ ఆదేశించారు.

- 8లో ▸



ఎడ్ల పొలాల అమావాస్య

జిల్లాలో సోమవారం ఎడ్ల పొలాల అమావాస్య నిర్వహించారు. పశువులను ముస్తాబు చేసి పూజలు చేశారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
26.9 /21.4

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నేడు విద్యాసంస్థలకు సెలవు

కామారెడ్డి క్రైం: భారీ వర్షాలు కురుస్తున్నందున జిల్లాలోని విద్యాసంస్థలకు మంగళవారం కూడా సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యాసంస్థల యాజమాన్యాలు ఈ ఆదేశాలను పాటించాలని పేర్కొన్నారు.

బీర్కూర్‌లో సబ్ కలెక్టర్ పర్యటన



బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలో సోమవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి పర్యటించారు. తహసీల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. బీసీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. ఆమె వెంట తహసీల్దార్ శ్రీలత, పంచాయతీ కార్యదర్శి గంగాధర్, మాజీ ఎంపీపీ రఘు తదితరులు ఉన్నారు.

ఖోఖో పోటీలు వాయిదా

కామారెడ్డి అర్బన్: పాల్వంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించాల్సిన ఉమ్మడి జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల ఖోఖో పోటీలు వాయిదా పడ్డాయి. భారీ వర్షాల కారణంగా పోటీలను ఈనెల 9వ తేదీకి వాయిదా వేసినట్లు ఖోఖో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూమారెడ్డి, అతీకుల్లా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 85559 96271, 73965 41233, 96762 69988 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పంటల పరిశీలన

గాంధారి: జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ సోమవారం మండలంలో పర్యటించారు. పోతంగల్, రాంపూర్ గడ్డ తండా, సర్వాపూర్, వెంకటాపూర్ తదితర గ్రామాల్లో పర్యటించి వరదలతో కొట్టుకుపోయిన, నీట మునిగిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదలు తగ్గిన అనంతరం క్షేత్ర స్థాయిలో పర్యటించి, పంటనష్టంపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. ఆయన వెంట ఏఈవోలు షోయబ్, దీక్షిత్‌రెడ్డి తదితరులున్నారు.

రూ. 5 లక్షలకు పెరిగిన పరిహారం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: వరదల్లో కొట్టుకుపోయి, నీట మునిగి చనిపోయిన వారి కుటుంబాలకు ఇచ్చే పరిహారాన్ని పెంచుతూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో రూ. 4 లక్షలు ఉన్న పరిహారాన్ని రూ. 5 లక్షలకు పెంచింది. అలాగే పశువులు చనిపోతే గతంలో రూ. 37,500 ఉన్న పరిహారాన్ని రూ. 50 వేలకు పెంచారు. మేకలు, గొర్రెలకు ఇచ్చే పరిహారాన్ని రూ. 4 వేల నుంచి రూ. 5 వేలకు పెంచుతున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్నాం'



కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో అమృత్ పథకం అమలుపై మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, జిల్లా అధికారులు, కాంట్రాక్టర్లు, కాంగ్రెస్ నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ పట్టణంలో రూ. 93 కోట్ల నిధులతో శాశ్వత డ్రెయినేజీ, తాగునీటి సమస్యలు పరిష్కరించనున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌లో ఫోన్ ద్వారా మాట్లాడి అమృత్ పథకం అమలు గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, కాంగ్రెస్ నేత గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వర్షాలతో రాజంపేట మండలం అన్నారం వద్ద కోతకు గురైన రోడ్డు



పాల్వంచ మండలం భవానీపేట -పోతారం మధ్యలో కొట్టుకుపోయిన రోడ్డు



దోమకొండలోని కామునికుంటకు బుంగపడి వృథా అవుతున్న నీరు

వర్షం.. నష్టం!

- దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు
- 600 ఎకరాల్లో నీట మునిగిన వరి
- మూడు రోజుల్లో ముగ్గురి మృత్యువాత



సింగితం రిజర్వాయర్ అలుగు గోడ కొట్టుకుపోవడంతో వృథా అవుతున్న వరద నీరు



నాగారం కాసులకత్త వంతెన ప్రారంభంలో కొట్టుకుపోయిన రోడ్డు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. వర్షాలతో నష్టం కూడా వాటిల్లింది. మూడు రోజుల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. రెండు రోజుల క్రితం పిడుగుపాటుకు గురైన నస్రుల్లాబాద్ మండలం బొప్పాస్‌పల్లికి చెందిన కీమ్యానాయక్ (65) చికిత్సపొందుతూ సోమవారం మరణించాడు. బీబీపేట మండలంలోని ఎడ్లకట్టవాగులో కొట్టుకుపోయిన మంథని దేవునిపల్లికి చెందిన కామటి నర్సయ్య (65) మృతదేహం సోమవారం లభ్యమైంది. భారీ వర్షంతో విద్యుత్ వైర్లు తెగి ఇంటిపై పడడంతో నస్రుల్లాబాద్ మండలానికి చెందిన స్వాతి అనే యువతి కరెంటుషాక్‌తో మరణించిన విషయం తెలిసిందే. మాచారెడ్డి మండలం లచ్చాపేటకు చెందిన జాలరి చేపల వేటకు వెళ్లి గల్లంతయ్యాడు. జిల్లాలో నాలుగు గొర్రెలు, ఒక ఆవు వర్షాలతో మృత్యువాతపడ్డాయి.

కూలిన ఇళ్లు..

భారీ వర్షాలతో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 81 ఇళ్ల దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న ఇళ్లను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. బాధిత కుటుంబాలకు పునరావాస ఏర్పాట్లు చేశారు. అలాగే శిథిలావస్థలోని ఇళ్లలో ఉంటున్న వారిని కూడా రిలీఫ్ సెంటర్లకు తరలించారు. జిల్లాలో పది రిలీఫ్ సెంటర్లలో 176 మందికి ఆవాసం కల్పించారు.

దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు..

జిల్లాలో మూడురోజులుగా కురుస్తున వర్షాలతో రోడ్లకు నష్టం వాటిల్లింది. జిల్లాలో తొమ్మిది చోట్ల రోడ్లు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. అయితే చాలా ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. కొన్ని రూట్లలో రాకపోకలకు కూడా ఇబ్బందికరంగా మారాయి. పాల్వంచ మండలం భవానీపేట -పోతారం మధ్య రోడ్డు ధ్వంసమవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. లింగంపేట మండలం నాగారం వంతెన వద్ద ఇరువైపులా మట్టి కొట్టుకుపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో నాగారం, కోర్పోల్, బాయంపల్లి, బాణాపూర్, లింగంపల్లి, నల్లమడుగు గ్రామాలతో పాటు పలు తండాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లెండి వాగు పొంగి ప్రవహిస్తుండడంతో మద్నూర్ మండలం గోజేగావ్‌కు రాకపోకలు నిలిచిపోయాయి.

నీటమునిగిన పంటలు..

జిల్లాలో 600 ఎకరాలలో వరి పంట నీట మునిగినట్లు అధికారులు చెబుతున్నారు. కొన్నిచోట్ల మక్క, పత్తి, సోయా పంట చేలల్లో కూడా నీరు నిలిచింది. మరో రెండు రోజులు వర్షాలు పడే అవకాశాలుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అలుగులు పారుతున్న చెరువులు

జిల్లాలో 1,515 చెరువులు, కుంటలు ఉండగా ఇప్పటివరకు 1,050 చెరువులు అలుగులు పారాయని నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్ తెలిపారు. మరో నాలుగు వందల చెరువులలో 75 శాతానికిపైగా నీరు చేరిందన్నారు. ఒకటి రెండు రోజుల్లో అన్ని చెరువులు అలుగులు పారే అవకాశాలున్నాయన్నారు. రెండు చెరువులకు బుంగలు పడ్డాయని, వాటికి మరమ్మతులు చేయించామని వివరించారు.

అధికారుల పర్యటన

జిల్లాలో వర్షాలతో జరిగిన నష్టాన్ని తెలుసుకోవడానికి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పలు గ్రామాలలో పర్యటించారు. భిక్కనూరులో నీటమునిగిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించారు. ఎస్పీ సింధు శర్మ పోచారం ప్రాజెక్టును సందర్శించి అక్కడ భద్రతా ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇచ్చారు. కామారెడ్డి పట్టణంలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, బాన్సువాడలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి పర్యటించి పరిస్థితిని సమీక్షించారు.

సింగితం రిజర్వాయర్‌కు ముప్పు



రిజర్వాయర్ అలుగు గోడను పరిశీలిస్తున్న సీఈ శ్రీనివాస్, అధికారులు

- కొట్టుకుపోయిన అలుగు గోడ
- పరిశీలించిన సీఈ శ్రీనివాస్

నిజాంసాగర్ : భారీ వర్షాలతో సింగితం రిజర్వాయర్ అలుగుకు ముప్పు ఏర్పడింది. వరద ఉధృతి కారణంగా అలుగు గోడ కొంత భాగం కొట్టుకుపోయింది. దీంతో వేలాది క్యూసెక్కుల వరద నీరు వాగు పాలవుతోంది. నర్వ గ్రామ శివారులోని సింగితం రిజర్వాయర్ అలుగు రిటర్నింగ్ వాల్ కూలిన విషయాన్ని గ్రామస్తులు రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో నీటిపారుదలశాఖ సీఈ శ్రీనివాస్, మహమ్మద్‌నగర్ తహసీల్దార్ సవాయిసింగ్, ఇరిగేషన్ ఏఈ శివ సంఘటన స్థలానికి వచ్చి రిజర్వాయర్ అడ్డుగోడను పరిశీలించారు. బుంగల కారణంగా అడ్డుగోడకు పగుళ్లు వచ్చి, వరద ఉధృతికి కొట్టుకుపోయిందని గ్రామస్తులు తెలిపారు. బుంగలకు సకాలంలో మరమ్మతులు చేపట్టకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. సీఈ శ్రీనివాస్ రైతులతో మాట్లాడుతూ బుంగ మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ. 22 లక్షలు మంజూరు చేసిందన్నారు. అయితే టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని పేర్కొన్నారు. వరద నీటి ప్రవాహం తగ్గిన తర్వాత యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపడతామన్నారు. ఆయన వెంట నీటిపారుదలశాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ కాశీనాథ్, నాయకులు గోర్గంటి రాములు, దుర్గయ్య, అంజయ్య తదితరులున్నారు.



అంతాపల్లిలో వరద ఉధృతికి కొట్టుకుపోయిన, నీటమునిగిన వరి పంట



బిచ్కుంద మండలంలో నీట మునిగిన సోయా



పల్లెబొగుడ తండా కాజ్‌వేపైనుంచి రాకపోకలు నిలిపివేసిన దృశ్యం

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిశీలన



డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

భిక్కనూరు: రామేశ్వర్‌పల్లి బొబ్బిలి చెరువులో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించడంపై విచారణ జరిపిస్తామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. సోమవారం ఆయన రామేశ్వర్‌పల్లిలో నీటమునిగిన డబుల్‌బెడ్ రూం ఇళ్లను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలోని పునరావాస కేంద్రం వద్దకు వెళ్లి, బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎఫ్‌టీఎల్ జోన్‌లో ఉన్న స్థలంలో డబుల్‌బెడ్ రూం ఇళ్లను నిర్మించడానికి ఇరిగేషన్ అధికారులు ఎలా అనుమతించారనే విషయంపైనా విచారణ చేస్తామన్నారు. అనంతరం ఆయన భిక్కనూరు మండల కేంద్రంలో కోతకు గురైన బొబ్బిలి చెరువు కట్టను పరిశీలించారు. భిక్కనూరు మండల కేంద్రానికి అటవీ ప్రాంతం నుంచి వచ్చే పిప్పిరివాగు వరదకాలువ ఆక్రమణకు గురవడం వల్లే శ్రీసిద్ధరామేశ్వర ఆలయానికి వెళ్లే తారు రోడ్డు కొట్టుకుపోయిందని స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన విచారణకు ఆదేశించారు. ఆయన వెంట ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్, ఎస్ఈ విద్యావతి, ఈఈ పోచమల్లు, తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు మద్ది సూర్యం, కాంగ్రెస్ నాయకులు ఇంద్రకరణ్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, బల్యాల సుదర్శన్, భీంరెడ్డి తదితరులున్నారు.

'ప్రజలను అప్రమత్తం చేయండి'



పోచారం ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎస్పీ సింధు శర్మ

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టు అలుగుపై నుంచి దిగువకు వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో మంజీర పరీవాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని ఎస్పీ సింధు శర్మ సూచించారు. సోమవారం ఆమె ప్రాజెక్టును సందర్శించారు. ఇరిగేషన్ ఏఈ శ్రీకాంత్‌తో మాట్లాడి ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వివరాలు తెలుసుకున్నారు. మంజీర పరీవాహక ప్రాంత ప్రజలు నదివైపువె వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆమె ఆదేశించారు. వరదనీటి వద్దకు వెళ్లి సెల్ఫీలు దిగకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ఆమెవెంట ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై మల్లారెడ్డి ఉన్నారు.

ఆదివారం ఉదయం 8.30 నుంచి సోమవారం ఉదయం 8.30 గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలు.. (మి.మీటర్లలో)

మండలం	వర్షపాతం	మండలం	వర్షపాతం
సదాశివనగర్	240.8	నిజాంసాగర్	97.1
తాడ్వాయి	208.5	మాచారెడ్డి	95.3
రామారెడ్డి	207.9	బీబీపేట	90.9
లింగంపేట	203.4	బాన్సువాడ	78.0
కామారెడ్డి	203.2	నస్రుల్లాబాద్	76.1
గాంధారి	166.1	పెద్దకొడప్గల్	72.7
రాజంపేట	159.8	పిట్లం	70.6
ఎల్లారెడ్డి	141.8	మద్నూర్	69.9
నాగిరెడ్డిపేట	130.6	జుక్కల్	65.7
భిక్కనూరు	115.8	బిచ్కుంద	63.5
దోమకొండ	110.1	డోంగ్లీ	53.0
పాల్వంచ	104.9	బీర్కూర్	48.3

'పోచారం'లోకి తగ్గిన ఇన్‌ఫ్లో



నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. సోమవారం ఉదయం 26 వేల క్యూసెక్కుల వరదనీరు రాగా.. సాయంత్రానికి 13 వేలకు తగ్గిపోయింది. ప్రాజెక్టు నిండుకుండలా ఉండడంతో అలుగుపై నుంచి 13,736 క్యూసెక్కుల నీరు పారుతూ మంజీర నదిలో కలుస్తోందని అధికారులు తెలిపారు.

కళ్యాణి ప్రాజెక్టు నాలుగు వరద గేట్ల ఎత్తివేత



ఎల్లారెడ్డి: కళ్యాణి ప్రాజెక్టులోకి ఆరువేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటిపారుదల శాఖ ఏఈ శివప్రసాద్ తెలిపారు. దీంతో నాలుగు వరద గేట్ల ద్వారా అంతే నీటిని మంజీర నదిలోకి వదులుతున్నామని పేర్కొన్నారు.

నిజాంసాగర్‌లోకి భారీ వరద



నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి సోమవారం రాత్రి 9 గంటల సమయంలో 53,100 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. మెదక్ జిల్లాలోని ఘనపురం ఆనకట్ట, హల్దీ వాగులతోపాటు పోచారం ప్రాజెక్టు అలుగుపైనుంచి పారుతున్న వరద వస్తోందని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా సోమవారం రాత్రి వరకు 1,398.58 అడుగుల(9.896 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని తెలిపారు.

కౌలాస్ ప్రాజెక్టులోకి 416 క్యూసెక్కులు..

కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో జుక్కల్ మండలంలోని కౌలాస్ నాలా ప్రాజెక్టులోకి 416 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటిపారుదలశాఖ ఏఈ రవిశంకర్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్ల(1.237 టీఎంసీ)కుగాను సోమవారం రాత్రి వరకు 455.60 మీటర్ల (0.729 టీఎంసీ) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

వైఎస్ హయాంలో ప్రాజెక్టు అభివృద్ధి

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి
- నిజాంసాగర్ ప్రాజెక్టు పరిశీలన

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టుతో పాటు ప్రధాన కాలువ ఆధునీకరణకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కృషి చేశారని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. నీటిపారుదలశాఖ సీఈ శ్రీనివాస్‌తో మాట్లాడి ప్రాజెక్టు నీటిమట్టం, ఇన్‌ఫ్లోల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ బతికి ఉంటే నిజాంసాగర్ ప్రాజెక్టు ఎప్పుడో బృందావనం అయ్యేదన్నారు. ఆయన హయాంలో ప్రాజెక్టు, ప్రధాన కాలువ సిమెంట్ లైనింగ్ పనుల కోసం రూ. 549.5 కోట్లు మంజూరు చేశారన్నారు. ప్రధాన కాలువ సిమెంట్ లైనింగ్‌తో పాటు డిస్ట్రిబ్యూటరి కాలువలు, తూములను అభివృద్ధి చేశామన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల సీఈలు శ్రీనివాస్, మధుసూదన్, ఎస్ఈ వాసంతి, ఈఈ సోలోమాన్ తదితరులు ఉన్నారు.



ప్రాజెక్టును పరిశీలిస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

వైఎస్సార్‌కు ఘన నివాళి

కామారెడ్డి టౌన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని సోమవారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్దనున్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముఖ్యమంత్రిగా ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, కౌన్సిలర్లు చాట్ల రాజేశ్వర్, కోయల్‌కర్ కన్నయ్య, రవీందర్ గౌడ్, నాయకులు కారంగుల అశోక్‌రెడ్డి, పంపరి లక్ష్మణ్, అంజాద్, గంగాధర్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

క్లుప్తంగా

'పోచారం' వద్ద పోలీసుల బందోబస్తు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలోని పోచారంప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి ప్రమాదకరంగా అలుగు పారుతున్న నేపథ్యంలో సోమవారం నుండి ప్రాజెక్టుకు ఇరువైపులా కామారెడ్డి, మెదక్ జిల్లాల పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ప్రాజెక్టులోకి పూర్తిస్థాయిలో చేరిన వరదనీరు అలుగుపై నుండి ఉధృతంగా దిగువకు ప్రవహిస్తుండడంతో సందర్శకులెవరూ ప్రాజెక్టు వద్దకు వెళ్లకుండా పోలీసులు పహారా కాస్తున్నారు. జిల్లాపరిధిలో సోమవారం ఎల్లారెడ్డి, లింగంపేట పోలీస్‌స్టేషన్లకు చెందిన సిబ్బంది బందోబస్తు చేపట్టారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

బాన్సువాడ రూరల్: బీర్కూర్ మండల కేంద్రంలో సోమవారం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఇద్దరు చిన్నారులు ప్రాణాలతో బయటపడ్డారు. బీర్కూర్‌కు చెందిన బండ సాయిలు, కవిత దంపతులు తమ ఇద్దరు పిల్లలు నమస్వీ(8), కృతిక(2)ను ఇంట్లో పడుకోబెడ్డి బయట పనులు చేసుకుంటున్నారు. ఇంతలో వర్షానికి తడిసిన గోడ కొంతభాగం చిన్నారులు పడుకున్న ప్రదేశానికి దగ్గరలో కూలింది. భయపడిన చిన్నారులు ఏడ్చుకుంటూ బయటకు వచ్చారు. వారు బయటకు వచ్చిన కొద్దిసేపటికే మిగతా గోడ భాగం కూలడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

ఉచిత వైద్య శిబిరం



భిక్కనూరు : మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో వరదవల్ల ఇబ్బందులకు గురైన ప్రజల కోసం భిక్కనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరంను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ వైద్యురాలు యెమిమా వరద బాధితులు 126 మందికి చికిత్స చేసి మందులు అందజేశారు.

గుండెపోటుతో బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడి మృతి



భిక్కనూరు : మండల బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు, తిప్పాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు ఏనుగు భాస్కర్‌రెడ్డి (49) గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. ఇంట్లోనే గుండెపోటు రావడంతో మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

జీజీహెచ్ వార్డులోకి వర్షం నీరు



కామారెడ్డి టౌన్ : కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని ఆయా వార్డులోకి లీకేజీలతో వర్షపు నీరు చేరుకుంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఆస్పత్రిలోని రెండో అంతస్తులో మెటర్నిటీ వార్డులో చికిత్సలు పొందుతున్న మహిళల బెడ్స్ కిందకు భారీగా నీరు వచ్చాయి. ఆరు నెలల క్రితం కురిన వర్షానికి ఈ వార్డులో బిగించిన పీవోపీల కొంత భాగం పడిపోయిన విషయం తెలిసిందే. అక్కడ నుంచి భారీగా వర్షపు నీరు లీకేజీలతో వార్డులోకి నీరు చేరుకుంటున్నాయి. మిగతా పీవోపీ కూడా పడిపోయే ఆనవాలు కనబడుతున్నాయి. మూడో అంతస్తులో రేకుల షెడ్డులతో నూతనంగా నిర్మించిన వార్డుల్లోకి లీకేజీలతో చికిత్సలు పొందుతున్న వారి బెడ్స్ వద్దకు నీరు చేరాయి. సానిటేషన్ కార్మికులకు రోజంతా నీటిని తొలగించే పనిలో పడ్డారు. అధికారుల నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందని రోగులు ఆగ్రహిస్తున్నారు.



జప్తిజాన్కంపల్లిలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు



మత్తమాల శివారులో పోచారం కాలువ తూం వద్ద ఏర్పడిన గుంతలు



తాడ్వాయి మండలం ఎండ్రియాల్‌లో వర్షానికి కూలిన ఇల్లు

జనజీవనం అతలాకుతలం

జిల్లావ్యాప్తంగా వర్షాలు జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు చాలాచోట్ల పెంకుటిళ్లు నేలమట్టమయ్యాయి. వాగులు, అలుగులు పొంగిపొర్లి రోడ్లపై రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు సమస్యాత్మక ప్రాంతల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడి సహాయక చర్యలను ముమ్మరం చేస్తున్నారు. బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఎల్లారెడ్డి ఎస్సీ బాలికల వసతి గృహంలో చేరిన నీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు



రెడ్డిపేటలో దామర చెరువుకు పడ్డ గండి



నస్రుల్లాబాద్ పాఠశాలలో నేలకొరిగిన చెట్టు



గోజేగావ్ వద్ద రోడ్డును మూసివేసిన అధికారులు



అన్నారెడ్డిపల్లి వద్ద కొట్టుకుపోయిన వంతెన



అడివిలింగాలలో కూలిన ఇంటి వెనుక భాగం



పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట రోడ్డుపై నిలిచిన వరదనీరు

సంక్షిప్తం

నవజాత శిశువు మృతి



బాన్సువాడ : మండల కేంద్రంలోని ప్రభుత్వ మాతా శిశు ఆస్పత్రిలో సోమవారం అప్పుడే పుట్టిన బిడ్డ మృతి చెందింది. పాతవర్నికి చెందిన సోని అనే గర్భిణి డెలివరీ కోసం 3 రోజుల క్రితం ఆస్పత్రిలో చేరింది. వైద్యులు నార్మల్ డెలివరీ చేయాలనే ఉద్దేశంతో నొప్పుల కోసం ఎదురు చూశారు. సాయంత్రం నొప్పులు తీవ్రంగా రావడంతో ఆపరేషన్ చేశారు. అప్పటికే బిడ్డ ఉమ్మనీరు మింగి మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు వైద్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే బిడ్డ మృతి చెందిందని ఆరోపించి ఆందోళన చేశారు. ఈ విషయమై సూపరింటెండెంట్ విజయలక్ష్మిని వివరణ కోరగా స్కానింగ్‌లో డెలివరీ డేట్ సోమవారం ఉండటంతో వేచి చూశారన్నారు. ఆపరేషన్ చేయగా బిడ్డ మెడచుట్టూ పేగు చుట్టుకుని, ఉమ్మనీరు తాగడంతో కడుపులోనే మృతి చెందిందన్నారు. విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

చెట్లకొమ్మల తొలగింపునకు ఆధునిక పరికరం



దోమకొండ : విద్యుత్ తీగల వద్ద చెట్లకొమ్మల తొలగింపునకు ఆధునిక పరికరం తెప్పించినట్లు సోమవారం దోమకొండ ట్రాన్స్‌కో ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఎత్తయిన విద్యుత్ తీగల మధ్య ఉన్న చెట్ల కొమ్మలను కూడా కింది నుంచి తొలగించవచ్చన్నారు. విద్యుత్ అంతరాయాలను దీనివల్ల చాలా తగ్గించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ కిరణ్ చైతన్య, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని మోడెగాం గ్రామానికి చెందిన ఓ యువకుడు రెండు రోజుల క్రితం అదృశ్యం అయినట్లు ఎస్సై రంజీత్ తెలిపారు. గ్రామానికి చెందిన కుంట అశోక్ రెడ్డి అనే యువకుడు ఇంటి నుంచి వెళ్లి కనబడకుండా పోయినట్లు పేర్కొన్నారు. బంధువుల ఇళ్ల వద్ద ఆచూకీ కోసం వెతికిన లభించలేదు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సబ్ కలెక్టర్ కిరణ్మయికి సన్మానం



బాన్సువాడ రూరల్ : బాన్సువాడ సబ్ కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన కిరణ్మయిని సోమవారం బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. నాయకులు ఎజాజ్, మోయినోద్దీన్, బుల్లెట్ రాజు, అలీమోద్దీన్, హకీం, రఫీఖ్, తదితరులు ఉన్నారు.

మాజీ ఎంపీటీసీకి అభినందన



భిక్కనూరు : మండలంలోని రామేశ్వర్‌పల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డిని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సోమవారం అభినందించారు. రామేశ్వర్‌పల్లి గ్రామంలో వరద నీటిలో డబుల్ బెడ్ రూమ్ం మునిగిపోయి ఇబ్బందులు పడ్డ విషయమై కలెక్టర్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలు నేతలు బాధితులకు మాజీ ఎంపీటీసీ సభ్యుడు చంద్రకాంత్‌రెడ్డి టిఫిన్, భోజనం ఇతర సౌకర్యాలు కల్పించారని కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాజీ ఎంపీటీసీ సభ్యుడు చంద్రకాంత్‌రెడ్డిని అభినందించారు.

రెడ్ల ఆత్మీయ సమ్మేళనాన్ని సక్సెస్ చేయాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : 15న జిల్లా కేంద్రంలోని లక్ష్మీదేవి గార్డెన్స్‌లో రాజా బహదూర్ వెంకట్రాం రెడ్డి విద్యా పరిషత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెడ్ల ఆత్మీయ సమ్మేళనాన్ని సక్సెస్ చేయాలని ట్రస్ట్ అధ్యక్షుడు నాగర్తి చంద్రారెడ్డి కోరారు. సోమవారం మండలంలోని పద్మాజివాడిలో ఆహ్వాన పత్రికలను అందజేశారు.రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణాకర్ రెడ్డి, మండలాధ్యక్షుడు గంగారెడ్డి ఉన్నారు.

కాజ్‌వేను మూసివేయండి



భవానీపేట, పోతారం గ్రామాల మధ్య ఉన్న కాజ్‌వేను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

మాచారెడ్డి : భవానీపేట, పోతారం గ్రామాల మధ్య ఉన్న కాజ్ వేను వరద తగ్గేవరకు మూసి వేయాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన పాల్వంచ మండలంలోని భవానీపేట, పోతారం గ్రామాల మధ్య కాజ్‌వే నుంచి ప్రవహిస్తున్న నీటి ప్రవాహాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాల కారణంగా కాజ్‌వే ప్రమాదకరంగా మారిందని ఎలాంటి రాకపోకలు లేకుండా బారికేడ్లు పెట్టాలని కలెక్టర్ తహసీల్దార్ జయంత్ రెడ్డిని ఆదేశించారు. జక్కుల చెరువు అలుగును పరిశీలించారు. కామారెడ్డి ఆర్డీవో రంగనాథరావు, డీపీవో శ్రీనివాస్ రెడ్డి, డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఎంపీడీవో గోపి బాబు, పోలీసు అధికారులు ఉన్నారు. అనంతరం పాల్వంచ మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వస తి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాల చుట్టు పరిశుభ్రంగా ఉంచాలని ఆయన సూచించారు. సోమవారం విద్యార్థులకు క్రమం తప్పకుండా హెల్త్ చెకప్ చేయిస్తున్నారా లేదా అని హాస్టల్ వార్డెన్ అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పా టించాలన్నారు. ఆర్డీవో రంగనాథ్‌రావు, డీఎస్ సీడీవో రజిత, డీపీవో శ్రీనివాస్, ఏఎస్ సీడీవో వెంకటేష్ పాల్గొన్నారు.

పంటల పరిశీలన



రాజంపేట : మండలంలో రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నీట మునిగిన పంటలను మండల వ్యవసాయ అధికారులు పరిశీలించారు. మండలంలోని రాజంపేట, తలమండ్ల కొండాపూర్, గుండారం, అరగొండ గ్రామాలలో పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి సునీత రాణి మాట్లాడుతూ వరి, మొక్కజొన్న పంటల్లో నీటిని పూర్తిగా తొలగించాలన్నారు.

కుంగిన రోడ్డుకు మరమ్మతులు



రాజంపేట : మండలంలోని కొండాపూర్ ఎల్లారెడ్డి పల్లి గ్రామాల మధ్య నూతనంగా నిర్మించిన బ్రిడ్జి వద్ద రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కుంగిపోవడంతో సోమవారం కొండాపూర్ జీపీ ఆధ్వర్యంలో కంగిపోయిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టి రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్యదర్శి శ్రీజ, నాయకులు నరేందర్ గౌడ్, మా శెట్టి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అలుగెల్లిన బీబీపేట పెద్ద చెరువు



అలుగు పారుతున్న బీబీపేట చెరువు

బీబీపేట : ఉమ్మడి జిల్లాలోనే పెద్ద చెరువుల్లో ఒకటైన బీబీపేట పెద్ద చెరువు సోమవారం ఉదయం నుంచి అలుగు పారింది. ఈ చెరువు విస్తీర్ణం 510 ఎకరాలు ఉంది. సుమారు పది గ్రామాలకు 3 వేల ఎకరాలకు సాగునీరు అందించే సామర్థ్యం ఉన్న ఈ చెరువు అలుగు పారడంతో రైతుల్లో ఆనందోత్సాహం కనిపించింది. వర్షాకాలం ప్రారంభం నుండి చెరువులోకి ఒక చుక్క నీరు రాకపోవడంతో చాలా మంది నిరాశ చెందారు. కానీ గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురవడంతో ఎడ్లకట్ట వాగు, మానాల వాగు రావడంతో చెరువు జలకళను సంతరించుకుంది.

ప్రమాదకరంగా చేపల వేట..

అసలే దంచి కొడుతున్న వానలు, ఆపై ప్రమాదకరంగా వాగులు, అలుగులు పారుతుండగా.. కొందరు జాలర్లు ఆయా ప్రాంతాల్లో ప్రమాదకర స్థితిలో చేపలు పడుతూ కనిపించారు. ఓవైపు ప్రమాదకరంగా బీబీపేట పెద్ద చెరువు అలుగు పారుతుంటే అలుగు మధ్యలోకి వెళ్లి చేపలు పడుతున్నారు జాలర్లు. పైనుంచి వరద ఉధృతి పెరుగుతుండడాన్ని గమనిస్తున్నప్పటికీ వారు పట్టువదలకుండా చేపలు పడుతున్నారు.

బాధిత కుటుంబాలకు ఆశ్రయం



రాజంపేట : మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు శిథిలావస్థలో ఉన్నటువంటి ఇళ్లలో ఉన్న బాధిత కుటుంబాలను సంబంధిత జీపీ కార్యదర్శులు పునరావాస కేంద్రాలకు తరలించారు. రాజంపేట గ్రామంలో లస్కరి సాయిలు, మోతే లక్ష్మి, డీకొండ మాధవి, చాకలి రేవతి, దొమ్మాట బాలయ్య, మెత్తల లక్ష్మి ఇళ్లు శిథిలావస్థలకు చేరుకోగా వారిని సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించారు.

శిథిలమైన ఇళ్లల్లో ఉండొద్దు

బాన్సువాడ రూరల్ : శిథిలావస్థకు చేరి, కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న ఇండ్లలో ప్రజలు నివాసం ఉండరాదని తాడ్కోల్ పంచాయితీ కార్యదర్శి ప్రశాంతి సూచించారు. సోమవారం ఆమె తాడ్కోల్ గ్రామంలోని పలు వీధుల్లో పర్యటించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండకుండా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, రైతు వేదిక, సమాఖ్య భవనాల్లో నివాసం ఉండాలన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- పట్టణంలో పర్యటించిన ఎమ్మెల్యే కేవీఆర్



కామారెడ్డి టౌన్ : వరద ముంపు ప్రాంతాల, పట్టణ ప్రజలు భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం ఆయన పట్టణంలో పర్యటించారు. టేక్రియాల్ వద్ద కోతకు గురైన రోడ్డుతో పరిశీలించారు. హౌసింగ్‌బోర్డు, జీఆర్, పంచముఖీ హనుమాన్, గాంధీనగర్, కేపీఆర్, టీచర్స్, సైలానీబాబా కాలనీలలో పర్యటించి స్థానిక కాలనీవాసులతో మాట్లాడారు. కామారెడ్డి పెద్ద చెరువును పరిశీలించారు. మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, ఫైర్, పోలీస్ అధికారులు సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరం అయితేనే ప్రజలు బయటకు రావాలని కోరారు.

క్రైం కార్నర్

కార్పొరేటర్‌పై కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని మూడోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌతమ్‌నగర్‌కి చెందిన కార్పొరేటర్ శివచరణ్‌పై దాడి కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. సురేశ్ అనే వ్యక్తి తన ఇంటి ముందు నుంచి వెళ్తుండగా.. నా ఇంటి ముందు నుంచే వెళ్తావా అంటూ శివచరణ్ తన తమ్ముడు ప్రమోద్‌తో కలిసి తనపై దాడి చేశాడన్నారు. గాయాలపాలైన సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చైన్ సిస్టం బిజినెస్‌లో ఎక్సైజ్ కానిస్టేబుల్

ఖలీల్‌వాడి: జిల్లా ఎక్సైజ్ శాఖలోని ఓ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ చైన్ సిస్టం వ్యాపారం నిర్వహిస్తున్నారు. రూ.13వేలు చెల్లించి సభ్యత్వం తీసుకునే వారు మరో ముగ్గురిని సభ్యులుగా చేర్పాల్సి ఉంటుంది. సభ్యులను చేరిస్తే రూ.4వేల చెక్కుతోపాటు ఓ కంపెనీకి చెందిన దుస్తులు అందిస్తారు. అయితే, హెడ్ కానిస్టేబుల్ ద్వారా చైన్ సిస్టంలో చేరిన వారికి సభ్యత్వం రాకపోవడంతో వారు ఆయన ఇంటికి వెళ్లి గొడవ చేయగా వ్యవహారం బయటపడింది. యూ బిట్ కాయిన్‌లో ఎక్సైజ్ ఎస్సై గంగాధర్ అరెస్టైన ఘటన మరువకముందే మరో ఘటన ఎక్సైజ్ శాఖలో కలకలం రేపుతోంది.

వాగులో కొట్టుకుపోయి మృతి



బీబీపేట: భారీ వర్షాలకు వాగులో కొట్టుకుపోయి ఒకరు మృతి చెందిన ఘటన మరుసటి రోజు వెలుగులోకి వచ్చింది. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం మంథని దేవునిపల్లి గ్రామానికి చెందిన కామటి నర్సయ్య (65) ఓ వైన్స్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తాడు. ఆదివారం ఉదయం తన కూతురు దగ్గరికి బస్వాపూర్ గ్రామానికి వెళ్లాలని నిర్ణయించుకొని జనగామ, మాందాపూర్ గ్రామాల మధ్య ప్రవహిస్తున్న ఎడ్లకట్ట వాగు దాటే ప్రయత్నం చేశాడు. వరద ఉధృతికి కొట్టుకుపోగా సోమవారం అక్కడే పంట పొలాల మధ్య మృతదేహం లభించింది.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



కిమ్యానాయక్ (ఫైల్)

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : పిడుగుపాటు కారణంగా తీవ్రగాయాలపాలైన మండలంలోని బొప్పాస్‌పల్లి గ్రామానికి చెందిన కిమ్యానాయక్(65) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పశువుల కాస్తున్న సమయంలో శనివారం పిడుగు పడడంతో కిమ్యా తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు ఆయనను బాన్సువాడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

పురుగుల మందు సేవించిన వ్యక్తి..

బాన్సువాడ రూరల్: మండలంలోని రాజారాం దుబ్బ కాలనీకి చెందిన సాదుల దుర్గయ్య(28) గత నెల ఆగస్టు 31న పురుగుల మందు సేవించగా కుటుంబ సభ్యులు బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. కడుపునొప్పి తాళలేక దుర్గయ్య పురుగుల మందుతాగాడని, తమకు ఎవరిపై ఎలాంటి అనుమానాలు లేవని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు.

మాటలతో మభ్య పెట్టి పుస్తెల తాడు చోరీ



వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై అనిల్

మాచారెడ్డి: మాటలతో మభ్య పెట్టిన ఓ మాయలేడి వృద్ధురాలి మెడలోనుంచి రెండు తులాల బంగారు పుస్తెల తాడును ఎత్తుకెళ్లింది. మాచారెడ్డిలో సోమవారం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన పందిరి రాజవ్వ గత కొన్నేళ్లుగా గజ్యానాయక్ తండా చౌరస్తాలో నివాసం ఉంటోంది. రాజవ్వ సోమవారం హాలులో సేదతీరుతుండగా, గుర్తు తెలియని మహిళ వచ్చింది. రాజవ్వ ఇల్లు ఇదేనా అని వృద్ధురాలిని ప్రశ్నించగా ఆమె అవునని బదులిచ్చింది. సదరు మాయలేడి ఇంట్లోకి చొచ్చుకుని వస్తుండడంతో రాజవ్వ వారించింది. దీంతో అయ్యో నన్ను గుర్తు పట్టలేదా? నేను రాజవ్వ కోడలిని.. ఇంతకుముందు తీసుకెళ్లిన వత్తులు బాగున్నాయి.. మళ్లీ వాటికోసం మళ్లీ వచ్చానని చెబుతూ ఇంట్లోకి చొచ్చుకు వెళ్లి మాటలు కలిపింది. కాసేపటికి ఇంట్లోని కూలర్‌లో పాము కనబడుతోందని రాజవ్వను మభ్యపెట్టడంతో.. ఆమె కూలర్ వైపు వెళ్తుండగా వెనుక నుంచి మాయలేడి ఆమె మెడలోని పుస్తెలతాడుని లాక్కుని పరారైంది. రాజవ్వ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

మోపాల్: కుటుంబ కలహాల కారణంగా మండలంలోని కులాస్‌పూర్ గ్రామానికి చెందిన సువర్ణ (35) సోమవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. సువర్ణకు ఆమె భర్త రాజుతో కొంత కాలంగా గొడవలు జరుగుతుండడంతో మనస్తాపానికి గురైన ఆయన ఇంట్లోనే ఉరేసుకుందని తెలిపారు. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారన్నారు. సువర్ణ, రాజు దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధురాలు..

నవీపేట: అనారోగ్యంతో బాధపడుతూ మండలంలోని అభంగపట్నం గ్రామానికి చెందిన బక్క సాయమ్మ(65) అనే వృద్ధురాలు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వినయ్ సోమవారం తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న సాయమ్మ ఈనెల 1న ఇంట్లోనుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదన్నారు. సోమవారం ఉదయం చెరువులో మృతదేహం లభ్యమైందని తెలిపారు. మృతురాలి కుమార్తె స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చీటీ నిర్వాహకురాలి ఇంటిపై దాడి

- డయల్ 100కు ఫిర్యాదు చేసిన బాధితులు
- నిజామాబాద్ నగరంలో ఘటన

ఖలీల్‌వాడి: చీటీ వ్యాపారం చేస్తున్న నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హబీబ్‌నగర్ కాలనీకి చెందిన మహిళ ఇంటిపై ఆమె వద్ద చీటీ వేసిన కొందరు నాలుగు రోజుల క్రితం దాడి చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. డబ్బులను ఈనెల 15న చెల్లిస్తానని సదరు మహిళ చీటీ వేసిన వారికి తెలిపింది. అయితే, చీటీ నడిపిన మహిళ నాలుగు రోజుల క్రితం తన కూతురు ఎంగేజ్‌మెంట్ చేస్తున్న విషయం తెలుసుకున్న వారు డబ్బులు ఎప్పుడు ఇస్తావని నిలదీసి దాడికి యత్నించారు. ఆ సమయంలో గొడవను వీడియోతీస్తున్న బాలికపై చీటీ వేసినవారు దాడి చేశారు. బాధితులు వెంటనే డయల్ 100కు కాల్ చేయడంతో ఘటనాస్థలానికి పోలీసులు చేరుకుని చీటీ వేసిన వారికి డబ్బులు ఇచ్చేయాలని చెప్పారు. కొన్ని రోజుల క్రితం ఇదే పోలీస్‌స్టేషన్‌లో అప్పు కేసుకు సంబంధించి భార్యాభర్తలను చితకబాదిన ఘటన చోటుచేసుకుంది.